క్లుప్తంగా

గుండెపోటుపై అవగాహన రేపు

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశంలో మంగళవారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీవీసీ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ వై.రామ్‌కిషోర్ కార్యక్రమంలో పాల్గొని 'గుండెపోటుకు కారణాలు.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై ప్రత్యేక ప్రసంగం చేయనున్నారని.. సభ్యుల సందేహాలను నివృత్తి చేస్తారని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

18వ మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విశాఖపట్నంలో నిర్వహించనున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించేందుకు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. పాలకులు కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటూ, కార్మిక వర్గాన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ తరుణంలో విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని అన్నారు. అనంతరం ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉండవల్లి కమిటీ అధ్యక్షుడిగా ఆవల నారాయణ, కార్యదర్శిగా మాగలూరి స్వర్ణ కుమారి, మరో తొమ్మిది మందితో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వాషింగ్ ప్లాట్‌ఫామ్‌కు శంకుస్థాపన



దుగ్గిరాల: చేతిపంపుల స్థానంలో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణం కోసం భూమి పూజ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న చేతి పంపుల స్థానంలో నూతనంగా రూ.1.60 లక్షల వ్యయంతో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నామని, దీంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.శోభాదేవి, దోస్త్ కమిటీ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గ సభ్యులు, గూడూరు వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోరంపూడి గ్రైటనాల్టెస్‌కి పరుపులు అందజేత

గ్రైటనాల్టెస్ డైరెక్టర్ వంగర హేమ చందు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోరంపూడిలో ఉన్న గ్రైటనాల్టెస్ లెప్రసీ ఆసుపత్రికి రోగుల అవసరాల నిమిత్తం పరుపులు, దిండ్లను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సిబ్బంది ఆదివారం అందించారు.

మున్సిపల్ కమిషనర్ బంగ్లాకు లేని మోక్షం!

- శిథిల భవనంపై నిర్లక్ష్యం
- కూల్చివేతకు తాత్సారం
- కొత్త భవనం ప్రశ్నార్థకం



శిథిలావస్థలో మున్సిపల్ కమిషనర్ బంగ్లా



బంగ్లా చుట్టూ పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు

తెనాలి: శిథిలావస్థకు చేరుకున్న భవనాల కూల్చివేతకు నోటీసులిచ్చిన మున్సిపాలిటీ, తమ సొంత భవనం విషయంలో ఎలాంటి చర్యలకు పూనుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొత్తపేటలో గల మున్సిపల్ కమిషనర్ నివాస భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిరుపయోగంగా ఉన్న ఆ భవనాన్ని కూల్చడం, ఆ స్థానంలో మరొక భవనం నిర్మాణం చేయడానికి మున్సిపాలిటీ ముందుకు రావడంలేదు. నూతన భవన నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం చేసినప్పటికీ.. ఆ దిశగా అడుగులు పడడంలేదు.

అమలు కాని తీర్మాణం..

కొత్తపేటలో మున్సిపాలిటీకి సువిశాలమైన స్థలం ఉంది. ఇందులో ఒకప్పటి రహదారి ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉండేది. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకూ ఉన్నతాధికారులు సహా ఎవరు తెనాలి పర్యటనకు వచ్చినా ఇందులోనే బస చేసేవారు. ప్రస్తుతం ఆ స్థానంలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రాన్ని నిర్మించారు. ఆ పక్కనే మున్సిపాలిటీ అతిథిగృహాన్ని నిర్మించుకున్నారు. అతిథిగృహానికి దక్షిణం వైపున మున్సిపల్ కమిషనర్ నివాస బంగ్లా ఉంది. అతిథిగృహం, కమిషనర్ బంగ్లాకు పడమర వైపున మున్సిపల్ ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్, తంత్రీ ప్రసారకేంద్రం ఉండేవి. కొన్నేళ్ల క్రితం రిక్రియేషన క్లబ్, తంత్రీ ప్రసార కేంద్రాన్ని కూల్చేశారు. ఆ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసమని గతంలో మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అది కార్యాచరణకు నోచుకోలేదు. ఖాళీగా ఉండడంతో ఆ స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. దీని నివారణకు ఈమధ్యనే చుట్టూ ఇనుపకంచెను వేశారు.

ప్రారంభం కాని కూల్చివేత పనులు..

ఏడు నెలలు పూర్తయినప్పటికీ పాత బంగ్లా పునర్నిర్మాణం కాదుకగా.. కనీసం పాత భవనం కూల్చివేతను కూడా ఆరంభించనేలేదు బంగ్లా చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో పాములు, తేళ్లు వంటి విష పురుగుల సంచారం క్రమేణా పెరుగుతోంది. పట్టణంలో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలనీ.. లేకుంటే మున్సిపాలిటీనే కూల్చివేస్తుందని.. అందుకయ్యే ఖర్చును మీ నుంచే వసూలు చేస్తామని 90 మంది ఇంటి యజమానులకు మున్సిపాలిటీ నోటీసులిచ్చింది. వాటిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలానే మున్సిపల్ కమిషనర్ బంగ్లాను కూడా విస్మరించారని పలువురు వాపోతున్నారు.

అద్దె భవనాల్లో నివాసం..

శిథిలావస్థకు చేరిన ఈ బంగ్లా నివాస యోగ్యంగా లేకపోవడంతో కమిషనరుగా వచ్చినవారు బయట అద్దె భవనాల్లో నివసిస్తున్నారు. గత పుష్కరకాలం పైగా ఈ బంగ్లా ఖాళీగా ఉంటోంది. దీంతో శిథిల భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక గతంలో బండి శేషన్న కమిషనర్‌గా ఉన్నప్పుడు బంగ్లాను పునర్నిర్మించాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన బంగ్లాను పడగొట్టి.. ఆ స్థానంలో నూతన బంగ్లా నిర్మాణానికి సన్నద్ధమయ్యారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నారు. పాత బంగ్లా పడగొట్టటం, కొత్త బంగ్లాకు డిజైన్, నిర్మాణ పనులకు ప్రాథమికంగా రూ.40 లక్షలను కేటాయించారు. ఇందుకయే వ్యయాన్ని మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వ్యయం చేసేందుకు నిర్ణయించారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అప్పట్లో చెప్పారు. మూడు నెలల వ్యవధిలో నిర్మాణ పనులు ఆరంభం కాగలవని అప్పట్లో మున్సిపల్ ఇన్‌చార్జి ఇంజినీరు ఆకుల శ్రీనివాసరావు వెల్లడించారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీకాంత్



తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పి.శ్రీకాంత్‌ను నియమించారు. ఈ మేరకు మున్సిపల్ డైరెక్టర్ పి.సంపత్ కుమార్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాంత్ మున్సిపల్ ఇంజినీరింగ్ తెనాలిలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎంవీ లక్ష్మీపతిరావు ఆదివారం పదవీ విరమణ చేయడంతో శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీపతిరావు పదవీ విరమణతో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీ అయ్యాయి.

నేటి నుంచి మరమ్మతుల పనులు

తెనాలి టౌన్: ప్రత్తిపాడు 220 కేవీ సబ్ స్టేషన్‌లో 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ పనులు సోమవారం నుంచి ఈనెల 9వ తేదీ మంగళవారం వరకు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కారణంతోనైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు గమనించి డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

సమాజ సేవపై అవగాహన కల్పించాలి



ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులతో డీజీ రాంప్రసాద్

తెనాలి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సమాజ సేవపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇంటరాక్ట్ క్లబ్లను ఏర్పాటు చేయనున్నట్లు రోటరీ 3150 డిస్టిక్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సుల్తానాబాద్‌లోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రోటరీ కార్యక్రమంలో రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో పోలియో మహమ్మారిని పారద్రోలడంలో రోటరీ ఇంటర్నేషనల్ ప్రముఖ పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్న సామెతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సేవ పట్ల అభివృద్ధి కలిగే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రెండు ఇంటరాక్ట్ క్లబ్‌లలో ఒక రోటరీ క్లబ్‌ను ఏర్పాటు చేసే అవకాశం తమకు కల్పించినందుకు డిస్టిక్ గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, రీజనల్ జాయింట్ సెక్రటరీ గుత్తా వెంకటరత్నం, రోటరీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటైన ఇంటరాక్ట్ క్లబ్‌లో ప్రెసిడెంట్లకు కాలర్లను డీజీ రాంప్రసాద్ బహూకరించారు. అనంతరం ఐతానగర్‌లోని ఇటీవల అపరకర్మశాలపై నిర్మించిన గదులను పరిశీలించారు. ఈ గదుల నిర్మాణానికి రోటరీ సభ్యులు రూ.2.50 లక్షలు విరాళాన్ని అందించారు. తదుపరి తెనాలి రోటరీ ఆధ్వర్యంలో పొట్ల రాఘవయ్య రైస్ మిల్లు వద్ద గల ఎలిమెంటరీ పాఠశాలలో అంగన్వాడీ కేంద్రం వద్ద రోటరీ ఆధ్వర్యంలో జరుగుతున్న వంటశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



తెనాలి అర్బన్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఇంటర్మీడియట్ విద్య పెన్షనర్స్ సంక్షేమ సంఘం తెనాలి అధ్యక్షుడు వై.ఎస్.ఇ.బోసు డిమాండ్ చేశారు. సంబంధిత కార్యవర్గ సమావేశాన్ని బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బోసు, కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షునిగా జి.సాంబశివరావు, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.ఆర్.కె. శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఇగ్బాల్ అహ్మద్, ట్రెజరరీగా ఆర్.శివకుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.సత్యనారాయణ, ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

ఆహారం, వ్యాయామం ఎంతో అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శారద

తెనాలి: మనిషి జీవనశైలిలో ఆహారం, వ్యాయామం ప్రత్యేకించి ముఖ్యమైనవని డాక్టర్ డి.శారద అన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. డి–3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు నిర్వహించి రోగులకు అల్పాహారం అందించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ.. షుగర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, కాళ్లకు పుండ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మనిషి జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులు ప్రత్యేకించి ఆహారం, వ్యాయామం వంటి విషయాలను తెలియజేశారు. శిబిరంలో కొందరికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోగులకు నెలకు సరిపడా అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన జవహార్‌బాబు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్: అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా జవహార్‌బాబు తీర్చిదిద్దారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన బిళ్లా జవహార్ బాబు అభినందన సభను ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 37 ఏళ్లు అధ్యాపకునిగా ఎంతోమంది అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. అనంతరం జవహార్‌బాబు, కె.సమతావాణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు బి.రాహుల్ బాబు, ఆర్.ప్రియాంక, పృథ్వీ, జెడ్.ఎస్.రామచంద్రరావు, బీవీ నరసింహారావు, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యం

మంత్రి నాదెండ్ల మనోహర్



కఠెవరం కార్యక్రమంలో మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహా

తెనాలి టౌన్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం, పినపాడు గ్రామాల్లో ఆదివారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహా పాల్గొని రేషన్ లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు వెంటనే తెలుస్తాయని అన్నారు. గతంలో కంటే మెరుగైన సులభతరమైన సేవలు ఈ కార్డుతో అందుతాయని తెలిపారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, డీలర్లు ఇంటింటికీ వచ్చి కొత్త కార్డులు ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో కఠెవరం సర్పంచి బండికళ్ల ప్రసాద్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఆర్ఐ జాన్, సీడీపీవో విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



తెనాలి టౌన్: వృద్ధాప్యంలో వచ్చే గుండె జబ్బులు, కీళ్ల నొప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైత్రీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ సూచించారు. స్థానిక కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఆగస్టు నెల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సందీప్ పాల్గొని వృద్ధాప్యంలో వచ్చే గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, షుగర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అబ్బూరు రామమూర్తి, కొరటాల ఈశ్వర్‌ప్రసాద్, అజ్గర్ ఆలీ, పి.పూర్ణచంద్రరావు, టి.కోటిరెడ్డి, చలమయ్య, కె.రామకృష్ణారావు, చెరుకూరు శివరామయ్య, పాల్గొన్నారు. అనంతరం సందీప్‌ను సత్కరించారు.

ఘనంగా డాక్టర్ ప్రజ్ఞాచారికి సత్కారం



ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న పద్మశ్రీ ఇనాక్

తెనాలి టౌన్: గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతిక సౌజన్యంతో తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30, 31 తేదీల్లో నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన తెలుగు భాషా ఉత్సవాలకు తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారికి ఆహ్వానం అందింది. ఈ ఉత్సవాల్లో ప్రజ్ఞాచారి పాల్గొని 'లలితా విభూషిత తెలుగు పదము' అను శీర్షికతో పద్య పఠనం చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విశ్రాంత ఉప కులపతి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ విచ్చేసి ప్రజ్ఞాచారి పద్య పఠానాన్ని విని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడారు. నేటి కాలంలో తెలుగు ఉన్నత స్థితిని ప్రస్తావిస్తూ 'తెలుగు విలపం' అనే పద్యకావ్యం రాసినట్లు పేర్కొన్నారు. దీని వల్ల తెలుగు భాషోత్సవాల్లో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ వంటి మహనీయుల చేత సత్కారం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

మహా ప్రసాదం.. గణపతి లడ్డూ వేలం

- ఘనంగా ఐదో రోజు ఏకదంతునికి పూజలు
- కొనసాగుతున్న నిమజ్జనాలు



మారీసుపేట పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్



గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ వాసులు

తెనాలి టౌన్: గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ కాంక్షించారు. పట్టణంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన పాల్గొని గణనాథునికి విశేష పూజలు నిర్వహించారు. జగ్గడిగుంటపాలెం గౌడకాలనీ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆయన సందర్శించి పూజలు నిర్వహించారు. జైగౌడ ఉద్యమం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, జగ్గడిగుంటపాలెం సర్పంచి కుంభం బాలాజీ, వై.లక్ష్మీనారాయణ పలువురు పెద్దలు పాల్గొన్నారు. స్థానిక మారీసుపేటలోని 22వ వార్డులో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో శివకుమార్ పాల్గొని మండప నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుబాయ్‌బాబు, తుమ్మ వెంకటరెడ్డి, సాయి శివనందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, రమేష్, రామకృష్ణ, బాజీ తదితరులు ఉన్నారు.

భక్తులకు అన్నసంతర్పణ..

ఐటీఐ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.భద్రవతి బాలాజీ, పసుపులేటి వెంకయ్య, కొడాలి క్రాంతి కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లోని ప్రజలు గణేష్ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిమజ్జనానికి ముందు లడ్డూ వేలం పాట నిర్వహించగా పరుచూరి వెంకటేశ్వరరావు రూ.5,100 వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఊరేగింపుగా స్వామి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మూడు లడ్డూలు వేలం..

తెనాలి టౌన్: స్థానిక రామలింగేశ్వరపేటలోని పుట్టా రాఘవయ్య రైస్‌మిల్ సెంటర్‌లో శ్రీ గణేష్ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. వినాయక నిమజ్జన కార్యక్రమానికి ముందు లడ్డూ వేలం పాట నిర్వహించారు. 18 కేజీల లడ్డూను రూ.1.48 లక్షలకు కారంశెట్టి బ్రదర్స్.. 11 కేజీల లడ్డూను రూ.72 వేలకు ఆరికాటి రవికుమార్.. 9 కేజీల లడ్డూను రూ.67 వేలకు నారిశెట్టి శశాంక్‌లు వేలంలో దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఆయన కుమారుడు గోపి విజేతలకు ఒక గ్రాము గోల్డ్ కాయిన్, రెండు గ్రాముల గోల్డ్ కాయిన్ బహుమతిగా అందజేశారు.

గణపతి లడ్డూ రూ.1.50 లక్షలు..



వేలంలో లడ్డూ దక్కించుకున్న బాలాజీ, రవిచంద్ర

తెనాలి అర్బన్: అభయ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో మారీసుపేట మఠంబజార్‌లో నిర్వహించిన గణేష్ మహోత్సవాల్లో ఆదివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. పళ్లెంపాటి బాలాజీ, పళ్లెంపాటి రవిచంద్రలు వేలం పాటలో రూ.1,50,116లకు లడ్డూను దక్కించుకున్నారు. ముందుగా గణనాథునికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురళీ, మణి, గిరిధర సాయి, లక్ష్మీనారాయణ, సురేష్, రబ్బానీ, వసంత్, సూర్య, తోట గోపి, బండారు గోపి, శివనారాయణ, రాగం గోపి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ



తెనాలి టౌన్: సమాజ సేవే లక్ష్యంగా జనసేన పార్టీ పని చేస్తోందని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం బీసీ కాలనీలో జనసేన నాయకులు మంచాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. జనసేన ఆధ్వర్యంలో ఇటీవల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మంత్రి మనోహర్ చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో జనసైనికులు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. గ్రామాల్లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారని తెలిపారు. అదే స్ఫూర్తిగా మంచాల రామకృష్ణ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, తోట పానకాలరావు, తులసీ, కె.సాంబశివరాజు, అల్లం మస్తాన్, ఆరిశెట్టి ఫణీంద్ర, సురేష్, దంతాల కిరణ్‌కుమార్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

నిడమర్రులో చోరీ

నిడమర్రు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రులో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కురంగేశ్వరరావు కుటుంబసభ్యులతో సహా ఆగస్టు 24వ తేదీన తిరుపతి వెళ్లారు. 26వ తేదీ తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.4 లక్షల విలువైన 30 గ్రాముల బంగారం, పలు వెండి వస్తువులు, రూ.45 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన దుండగులు చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో తమ ద్విచక్ర వాహనం వదిలి పారిపోయారని, వాహనం నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.